# దుష్యంత దుందుభి

-భమిడిపాటి సోమయాజి

దుష్యంతుని పెళ్ళి నిశ్చయమైంది. శ్రేయోభిలాషులు అందరూ సంతోషించారు! దుష్యంతుడికి మరపు ఎక్కువ! ఈ విషయం బయటపడి కొన్ని సంబంధాలు తప్పి పోయాయి. ఎవరికి ఎక్కడ ఘటనో!

హైస్కూల్లో చదువుకునే రోజుల్లో, క్వశ్చన్ పేపర్ వెనక్కి తిప్పడం మరచిపోయిన దుష్యంతుడు, ఆ ఏడాది పరీక్ష తప్పాడు! అప్పుడు అతని మిత్రుడు చెప్పాడు. "ఏమైనా మరచిపోతే, తలపైన కొట్టుకుంటే మరచిన విషయం జ్ఞాపకం వస్తుందనీ, తన మేనమామ అలా చేసుకుంటాడని." అప్పట్నుంచీ దుష్యంతుడు కూడా తలపై బాదుకుంటూ సత్ఫలితాలు సాధిస్తున్నాడు.

మరచిపోయినప్పుడల్లా అలా తలపై బాదుకోవడం చూసిన దుష్యంతుడి తల్లి తల్లడిల్లిపోయింది! ఈ విషయం తెలుసుకుని దుష్యంతుడి తండ్రి, "నాయనా! దుష్యంతా! అస్తమానూ అలా తల బాదుకోకు! ఏదైనా మరచిపోతే మళ్ళీ మొదల్నుంచీ చదువుకో! అదే జ్ఞాపకం వస్తుంది!" అని హితబోధ చేశాడు.

ముఖ్యమైన విషయాలన్నీ ఒక గంట ముందునుంచీ, "ఒరేయ్ మరచిపోతావు! జాగ్రత్త!" అని చెపుతూండేవారు, వాళ్ళు వాళ్ళు! పెళ్ళిరోజు కూడా, "జాగ్రత్త! మంగళ సూత్రం కట్టేప్పుడు, మూడు ముళ్ళు వెయ్యాలి!" అని పదే పదే చెప్పారు! పుస్తె కట్టే టైమ్‌కి మాత్రం ఆ మూడంకి మామూలుగా మరచిపోయాడు దుష్యంతుడు.

తలబాదుకుందామంటే రెండు చేతుల్లో మంగళసూత్రం వుంది. పాపం! ఈసారి ఆ పని వీలుకాలేదు! పెళ్ళి కూతురి జడ పైకెత్తి పట్టుకున్న దుష్యంతుని పెద్దక్క, ఈ విషయం గ్రహించి, "అదే! జీలకర్ర పడిపోతోందే!" అంటూ ఎవ్వరికీ అనుమానం రాకుండా, తమ్ముడి నెత్తి మీద కొట్టింది. వెంటనే "ఆ! అవును! మూడు!" అంటూ మూడు ముళ్ళు వేశాడు, పెళ్ళికొడుకు.

వివరాలు చెప్పకుండా ఏ పనీ చెయ్యని మంచి మనిషి భర్తగా దొరికాడని ముచ్చట పడింది పెళ్ళికూతురు!

పెళ్ళితంతు అలకపాన్పు దాకా వచ్చింది. అలక పాన్పు మీద మోటార్ సైకిల్ అడగమని పెళ్ళి కుదిరినప్పట్నుంచీ చెపుతూనే వున్నారు ఆడపడుచులు. దుష్యంతుడు మరచిపోయాడు! చుట్టూ జనం! ఏమడుగుతాడోనని పిల్ల తండ్రి గుబులు పడుతున్నాడు! అంత మంది జనంలో తల బాదుకుంటే బాగుండదని, దుష్యంతుడు పైకి చూడడం మొదలుపెట్టాడు! ఆ పైకప్పు చూసి ఏ ఇల్లయినా అడుగుతాడేమోనని, పిల్ల తండ్రి అల్లుడ్నే చూస్తున్నాడు. ఇంకో పెళ్ళి చేయించవలసిన పురోహితుడు తన చేతి గడియారం చూసుకుంటున్నాడు. దుష్యంతుడు మాత్రం ఆ వేడుకలో ఓడిపోయాడు.

"ఇక చాలు! పెళ్ళి సమయంలో, అనారోగ్యంగా వున్నట్లు, పెళ్ళికొడుకుని అంతసేపు మంచం మీద కూర్చోపెట్టడం అశుభం" అంటూ ఆ మంచం ఎత్తించి గోడకి వేయించేశాడు పురోహితుడు! పురోహితుడు అవతల ఇంకో పెళ్ళి చేయించాలి! అదీ అసలు విషయం.

ఆడపడుచులు "మంచి మోటార్ సైకిల్ పోయిందని" బాధపడ్డారు! ఎవ్వరో దొంగలు. దుష్యంతుడి మోటార్ సైకిల్ ఎత్తుకుపోయినట్లు!

దుష్యంతుడి మేనమామ అన్నాడు "ఏం ఫర్వాలేదు! అలకపాన్పు మీద పోయినవి, మొదటి పండక్కి వాటంతట అవే దొరుకుతాయి."

"ఆ! దొరకుతాయి తేరగా! అందరూ మా నాన్న లాంటి వాళ్ళుందరు!" అని కళ్ళు పెద్దవి చేసింది, మేనమామ భార్య.

గృహప్రవేశమప్పుడు పేర్లు చెప్పమన్నారు. "దుష్యంతుడు బావా, నేనూ వచ్చాం" అంది పెళ్ళికూతురు. పెళ్ళికూతురు పేరు శకుంతల అని మరచిపోయాడు దుష్యంతుడు. ఇంతలో ఎవరో "పేర్లు బాగున్నాయి. పురాణ దంపతుల పేర్లు - దుష్యంతుడు, శకుంతల" అన్నారు. అది విన్న దుష్యంతుడు "ఆ! శకుంతలా నేనూ వచ్చాం" అన్నాడు. ఒక గండం గడిచింది అనుకున్నారు మగ పెళ్ళివారు.

చుట్టూ వున్న జనం సంతోషించారు! "ఆ శకుంతల" కాదు బాబూ! ఇకపై నీ శకుంతలే!" అంది తెలుగు సినిమాలు చాలా చూసిన పెళ్ళికూతురి అక్కయ్య.

❖ ❖ ❖

సంక్రాంతి పండక్కి దుష్యంతుడు ఒంటరిగానే అత్తారింటికి వెళ్ళాడు! ఈసారైనా ఆ మోటార్ సైకిల్ అడగడం మరచిపోవద్దని చెప్పి పంపారు ఆడపడుచులు.

"అదెలా మరుస్తాను మా అత్తారిల్లు మెయిన్ రోడ్ మీదే వుంది. బోల్డు మోటార్ సైకిళ్ళు వెళుతూనే వుంటాయి.!"

వెళ్ళిన వెంటనే అడుగుతే బాగుండదని వూరుకున్నాడు. సంక్రాంతి నాడు ఏదో అడగమన్నారని గుర్తొంచింది కాని ఏమడగమన్నారో గుర్తురాలేదు.

కనుమనాడు ఎవరి కంట పడకుండా తల మీద బాదుకున్నాడు. గుర్తురాలేదు. అయినా వదల్లేదు. ప్రయత్న లోపమెందుకని డాబా మీదకి వెళ్ళి మళ్ళీ తల బాదుకున్నాడు. పండక్కి తలంటు పోసుకుని జుట్టు ఆరపెట్టుకుంటూన్న యిరుగు పొరుగు వాళ్ళు చూశారు. "మీ అల్లుడు తల బాదుకోవడం చూడలేకపోతున్నాం. అలా వూరుకుంటారేం. అతనేమైనా పండగ కోరిక కోరితే ఇచ్చెయ్యండి" అని చెప్పారు.

మినపసున్ని తింటూన్న అల్లుడ్ని, "ఏం కావాలి బాబూ!" అని అడిగారు మామగారు.

అసలే మతిమరుపు, ఆపైన మినపసున్ని అతిగా తిన్న అల్లుడికి అసలు విషయం జ్ఞాపకం రాలేదు.

ఈ మినప సున్ని చాలా బాగుంది నాకింకేం వద్దు అని నాలుక కరచుకుని తమాయించుకున్న దుష్యంతునికి "మోటార్ సైకిల్" బదులు "సైకిల్" ఒక్కటే జ్ఞాపకం వచ్చింది. ఇది కూడా మరచిపోతామని ఒక సైకిల్ యిమ్మన్నాడు.

"హమ్మయ్య! బ్రతుకుజీవుడా" అని ఒక సైకిల్ కొని యిచ్చాడు మామగారు.

ఆ రాత్రి, అల్లుడి మరుపు తన పాలిటి వరంగా తలచుకుని నవ్వుకుంటూ పడుకున్నాడు మామాశ్రీ.

పండగలైపోయి, మోటర్ సైకిల్‌కి బదులు సైకిల్ సంపాదించిన దుష్యంతుడి దౌర్భాగ్యం గురించి తెలుసుకున్న ఆడపడుచులు ఉసూరుమన్నారు. వీడి తలకాయ ఏ మిషన్లోనైనా పెట్టేస్తే వదిలిపోతుందన్నారు.

"వద్దర్రా! వాడికి పెళ్ళి కూడా అయింది అంది దుష్యంత మాత."

❖ ❖ ❖

ఉగాది పండక్కి ఒక పట్టుచీర కొనమంది శకుంతల. షాపుకి తీసుకెళ్ళి, మూడు వేలల్లో ఒక పట్టుచీర తీసుకోమన్నాడు దుష్యంతుడు. ఒక అయిదు వందలే ఎక్కువ కదానని, మూడువేల అయిదువందల మెరూన్ కలర్ పట్టుచీర తీసుకుంది శకుంతల. దుష్యంతుడి దగ్గర మూడువేలే వున్నాయి.

ఇంటికి వెళ్ళి అయిదు వందలు తెస్తానని శకుంతల్ని షాపులో కూర్చోపెట్టి యింటికి బయల్దేరాడు దుష్యంతుడు. ఇంటికి వచ్చి జేబులోంచి తాళం చెవి తియ్యబోయాడు. తీరా చూస్తే తాళం చెవి కనపల్లేదు. దారిలో పోయిందని వెతకడం మొదలుపెట్టాడు. అసలు ఆ తాళం చెవి శకుంతల దగ్గరే వుండిపోయింది. "ఆర్నెల్లు సహవాసం చేస్తే వారు వీరవుతారు. శకుంతలైనా ఆ తాళం చెవి ఇవ్వలేదు!

దుష్యంతుడు తాళంచెవి కోసం వెతుకుతూనే వున్నాడు. చెలి మెలిపెట్టే శకుంతల షాపులోనే వుండిపోయింది.

దుష్యంతుడు, శకుంతలని షాపులో వదిలి వెళ్లడం చూసిన ఆమె స్నేహితురాలు, "హాయ్ శకుంతలా! గుర్తుపట్టావా?" మీ దుష్యంతుడు గారు రారు కాని, నా దగ్గర డబ్బు తీసుకుని, ఆ చీర యింటికి తీసుకువెళ్ళు" అంటూ డబ్బు సర్దుబాటు చేసింది.

ఆశ్చర్యపోయిన శకుంతల "మా వారి పేరు నీకెలా తెలుసే? నువ్వెన్నాళ్లయింది ఈ వూరు వచ్చి?" అంది.

"నేనీ వూళ్ళోనే వుంటున్నాను. మీ వారు నాకెలా తెలుసేమిటి! ఆయన "మరపు మారాజు" చాలామందికి తెలుసు. అసలు మీ దుష్యంతుడు గారు నన్ను కూడా పెళ్ళిచూపులు చూశారు. మా వాళ్లకి యీయనకి మరపు వుందని అనుమానం వచ్చింది. అలా తప్పిపోయింది నాకీ సంబంధం. ఇంతకీ "ఆ తల యింకా బాదుకుంటున్నాడా మీ ఆయన? ఏమనుకోకే, నువ్వు చాలా క్లోజ్ అని అడుగుతున్నాను" అంది స్నేహితురాలు.

"ఏంచేస్తాం.. అంతా నా ఖర్మ.." అని ఆ చీర తీసుకుని ఇంటికి వచ్చిన శకుంతలకి దుష్యంతుడు కనపడలేదు. కొంతసేపటికి షాపునుంచి తిరిగి వచ్చిన దుష్యంతుడు, "శకుంతలా! ఇప్పుడే షాపుకి వెళ్ళాను. నీ దగ్గర తీసుకున్న తాళం చెవి ఎక్కడో పడిపోయింది. అయితే నీ దగ్గర డూప్లికేట్ తాళం కూడా వుందన్నమాట!"

"డూప్లికేట్ తాళం కాదు, అసలు మీరే డూప్లికేట్. ఈ విషయం తెలియక మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నాను. చిన్నప్పట్నుంచీ తల బాదుకుంటూనే వున్నారట కదూ!"

"సారీ! ఇకపైన తల బాదుకోను"

"ఏం? ఎవ్వరి చేతనైనా బాదించుకుంటారా?" అని ఆ రాత్రి భోజనం చెయ్యకుండా పడుకుంది.

❖ ❖ ❖

ఈ రభస అంతా శకుంతలకి అత్యంత శ్రేయోభిలాషైన మేనత్తకి తెలిసింది. ఆవిడ మంచి కర్రతో ఒక అప్పడాల కర్ర చేయించింది. "ప్రేమతో" అని దాని మీద రాయించింది. ఒక ఉత్తరంతో పాటు ఆ అప్పడాల కర్ర మేనకోడలికి పంపింది.

"దుష్యంతుడు తల బాదుకోవడం చూసి, నువ్వు భరించలేకపోతే నువ్వే, యీ అప్పడాల కర్రతో వాటంగా అతని తలపై బాదెయ్యి! నా ఆశీర్వచనములు నీకెప్పుడూ వుంటాయి. బెంగపడకు, ధైర్యంగా వుండు అన్న ఆ ఉత్తరంలోని సారాంశం చదివిన శకుంతలకి ఎక్కడలేని మనో ధైర్యం వచ్చింది.

శకుంతల శరీరంలో ఒక భాగంలా, సజీవ కళతో ఆమెతోనే సంచరించేది ఆ అప్పడాల కర్ర!

కొన్నాళ్ల తర్వాత "దుష్యంత దుందుభి" ఎలా వుంది అని అడిగింది మేనత్త.

"దుందుభి" అంటే "భేరి" అని, తన భర్త తలకాయే దుందుభిలా వాయించుకుంటున్నాడని తెలుసుకున్న శకుంతలకి, నవ్వాలో ఏడవాలో తెలియలేదు. శకుంతల పాలిటి జీవగర్ర అయిన అప్పడాల కర్ర మాత్రం జీవం లేని నవ్వు నవ్వింది. ■